క్లుప్తంగా

నేడు 'సమాధుల పండుగ'



సమాధికి రంగు వేస్తున్న మహిళ

పాకాల : స్థానిక క్రైస్తవుల శ్మశానవాటిక(సమాధులతోట) సమాధుల పండుగకు సిద్ధమైంది. ఏటా నవంబర్ 2వ తేదీన ప్రపంచవ్యాప్తంగా ఆల్‌సోల్స్ డేని క్రైస్తవులు ఘనంగా జరుపుకుంటారు. ఈ సందర్భంగా శుక్రవారం క్రైస్తవులు శ్మశానవాటికలో పిచ్చిమొక్కలు, గడ్డి వంటి వాటిని తొలగించి శుభ్రం చేశారు. సమాధులకు రంగులు వేశారు. శనివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి సీఎస్ఐ, ఆర్‌సీఎం చర్చి ఫాదర్‌తో కలసి క్రైస్తవులు తమ ఆత్మీయులు, కుటుంబ పెద్దల సమాధుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేసి నివాళులు అర్పిస్తారు.

తలకోనలో అమావాస్య పూజలు



శ్రీ సిద్ధేశ్వర స్వామి ఆలయంలో..

భాకరాపేట : తలకోన శ్రీ సిద్ధేశ్వర స్వామి ఆలయంలో వైభవంగా అమావాస్య కేదారేశ్వరి నోములు వ్రతం భక్తి శ్రద్ధలతో శుక్రవారం నిర్వహించారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. ప్రత్యేకంగా అలంకరించిన దేవతామూర్తుల ముందు వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ భక్తులు నోములు నోచుకున్నారు.

వల్లభాయ్ పటేల్‌కు నివాళి



పటేల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

తిరుపతి గాంధీ రోడ్: భారతదేశ ఐక్యతకు, సమగ్ర అభివృద్ధికి, ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన కృషి మరువలేనిదని తిరుపతి జిల్లా బీజేపీ సాంస్కృతిక విభాగం కన్వీనర్ గుండాల గోపీనాథ్ రెడ్డి అన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ 149వ జయంతి సందర్భంగా భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో స్థానిక ప్రధాన తపాలా కార్యాలయం వద్ద సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నేతలు పాల్గొన్నారు.

ఆగమోక్తంగా అమావాస్య ఉత్సవం



తిరుచ్చి పైనుంచి అభయమిస్తున్న అమ్మవారు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురువారం అమావాస్య ఉత్సవం ఆగమోక్తంగా నిర్వహించారు. ఆలయ అలంకార మండపంలో జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామికి పలు రకాల అభిషేకాలు నిర్వహించారు. అనంతరం చప్పరాలపై అధిష్టించి పురవిహారం చేయగా భక్తులు మొక్కులు చెల్లించారు. ఊరేగింపులో భక్తులకు ప్రసాదాలను వితరణ చేశారు. కార్యక్రమంలో ఈఓ చంద్రశేఖర్ ఆజాద్, ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

గుండెపోటుతో రిటైర్డ్ టీచర్ మృతి

రేణిగుంట: గుండెపోటుకు గురై రిటైర్డు టీచర్ మృతి చెందిన ఘటన గాజులమండ్యం పంచాయతీలో చోటు చేసుకుంది. వివరాలు..జీవాగ్రంలో నివాసం ఉంటున్న ఏ.విజయరాజులు(62) తిరుపతి పద్మావతిపురం జెడ్పీ హైస్కూల్లో తెలుగు పండిట్‌గా పని చేసి రిటైర్డ్ అయ్యారు. గురువారం రాత్రి భోజనానంతరం పడుకున్న కాసేపటికే గుండెపోటు రావడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఆస్పత్రికి తరలించే లోపే మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

పేలని పటాస్

తిరుపతి మహానగరంలో దీపావళి హంగామా ఈ ఏడాది అనుకున్న స్థాయిలో కనపించలేదు. చిన్నారుల నుంచి పండుటాకుల వరకు దీపావళిని ప్రత్యేకంగా జరుపుకునేవారు. ఇంక టపాకాయలు పేల్చడంలో పోటీ పడేవారు. గతేడాది తిరుపతి నగరంలోనే సుమారు రూ.20 కోట్లకుపైగా టపాసుల వ్యాపారం జరిగితే ఈసారి 60శాతానికి మించి అమ్మకాలు జరగలేదు. మహిళలు, యువతులు ఇంటి గడపల వద్ద దీపాలు పెట్టి సరిపెట్టారు.

- నెలాఖరులో వచ్చిన దీపావళి
- పేద, మధ్యతరగతి కుటుంబాలకు అందని ప్రభుత్వ పథకాలు
- నగరంలో పెద్దగా కనిపించని పండుగ సందడి
- ఒక్కో టపాసుల దుకాణానికి రూ.60 వేల జీఎస్టీ విధింపు
- విక్రయాలు లేక లబోదిబోమంటున్న దుకాణదారులు
- ఖాళీగా దర్శనమిచ్చిన క్రాకర్స్ దుకాణాలు



డీబీఆర్ ప్రాంతంలో ఖాళీగా ఉన్న క్రాకర్స్ దుకాణాలు

తిరుపతి సిటీ/తిరుపతి తుడా: ఈసారి దీపావళి వెలుగులు పెద్దగా కనిపించలేదు. పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలకు ప్రభుత్వ పథకాలు సవ్యంగా అందకపోవడంతో ఈ ఏడాది పండుగ బోసిపోయింది. దానికితోడు దీపావళి పండుగ నెలాఖరులో రావడంతో ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగుల ఖాతాల్లో వేతనాలు పడకపోవడం వల్ల సందడి కనిపించలేదు.

జీఎస్టీ రూ.60 వేలు విధింపుతో..

గతేడాది నగరంలోని ఏర్పాటు చేసిన ఒక్కోదుకాణానికి రూ.20 వేలు మాత్రమే జీఎస్టీ విధించారు. కానీ కూటమి ప్రభుత్వం ఈ ఏడాది ఏకంగా మూడురెట్లు పెంచి రూ.60 వేలు విధించడంతో దుకాణదారులు లబోదిబోమంటున్నారు. ఇంత జీఎస్టీ విధిస్తే తాము బతకడమెలా అంటూ ప్రశ్నిస్తున్నారు. కొనుగోలుదారులు గత ఏడాది రూ.10వేలకు కొనుగోలు చేసే కస్టమర్లు రూ.2 వేలతో సరిపెట్టుకోవడంతో విక్రయాలు దారుణంగా పడిపోయాయి. నగరంలో ఏర్పాటు చేసిన సుమారు 70 దుకాణాలలో ఇదే పరిస్థితి నెలకొందంటూ విక్రయదారులు వాపోతున్నారు.

షాపులు ఏర్పాటు చేసిన ప్రాంతం	దుకాణాల సంఖ్య	అమ్మకాలు
డీబీఆర్ వద్ద	25	60 శాతం
నెహ్రూమున్సిపల్ స్కూల్	29	70 శాతం
అన్నమయ్య సర్కిల్ రైతుబజార్	16	55 శాతం



పళ్లిపట్టుకు తగ్గిన తాకిడి

సాధారణంగా దీపావళి పండుగ వచ్చిందటే నగర యువత, ఉన్నత వర్గాల ప్రజలు వాహనాల్లో జిల్లా సరిహద్దు ప్రాంతమైన తమిళనాడులోని పళ్లిపట్టు నగరానికి వేల సంఖ్యలో వెళ్తారు. అక్కడ హోల్‌సేల్ దుకాణాల్లో క్రాకర్స్ కొనుగోలు చేసేవారు. కానీ ఈ ఏడాది సీన్ మారింది. 70శాతం మంది తెలుగు వాళ్లు ఈ ఏడాది టపాకాయలు కొనుగోళ్లకు రాలేదంటూ పళ్లిపట్టు దుకాణదారులు వాపోతున్నారు. ఇంత దారుణమైన అమ్మకాలు గతంలో ఎన్నడూ చూడలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దారుణంగా పడిపోయాయి



ఎంతో ఆశతో దుకాణాలు పెట్టుకున్నాం. ఈ ఏడాది అమ్మకాలు దారుణంగా పడిపోయాయి. పండుగ విషయంలో ప్రజల్లో నెలకొన్న సందిగ్ధంతో పాటు నెలాఖరులో దీపావళి రావడం కూడా అమ్మకాలు తగ్గడానికి కారణమే. దుకాణాల బాడుగ, ఎన్నడూ లేని విధంగా జీఎస్టీ మూడు రెట్లు పెంచారు. షాపుల యజమానులకు పెద్ద దెబ్బ. ప్రతి దుకాణదారుడు నష్టాలను చూడాల్సి వస్తోంది. విక్రయ కేంద్రంలో కనీసం 50శాతం టపాకాయలు కూడా సేల్ కాకలేదు.

– కల్పన, షాపు యజయాని, తిరుపతి

ఈ ఏడాది భారీ నష్టాలు..



గతేడాదితో పోల్చితే ఈ ఏడాది సుమారు 40 శాతం అమ్మకాలు పడిపోయాయి. గతంలో రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు వెచ్చించి టపాసులు కొనేవారు. ఈసారి కనీసం వెయ్యి రూపాయలకు కూడా టపాకాయలు కొనుగోలు చేసేందుకు వెనుకడుగు వేశారు. నగరంలో ఏర్పాటు చేసిన సుమారు 70 దుకాణాలలోనూ ఇదే పరిస్థితి ఉంది.

– మురళీకృష్ణ, దుకాణదారులు, తిరుపతి

కోదండ రామాలయంలో విశేష ఉత్సవాలు

తిరుపతి కల్చరల్: శ్రీకోదండరామస్వామివారి ఆలయంలో ఈనెలలో పలు విశేష ఉత్సవాలు జరుగనున్నాయి. ఇందులో భాగంగా నవంబర్ 2, 9, 16, 23, 30 తేదీల్లో శనివారం సందర్భంగా ఉదయం 6 గంటలకు శ్రీసీతారామ లక్ష్మణుల మూలవర్లకు అభిషేకం, సాయంత్రం 5 గంటలకు స్వామి, అమ్మవారిని తిరుచ్చిపై ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగింపు చేపడతారు. అనంతరం ఊంజల్‌సేవ నిర్వహిస్తారు. అలాగే 15వ తేదీన పౌర్ణమి సందర్భంగా ఉదయం 8.30 గంటలకు అష్టోత్తర శతకలశాభిషేకం నిర్వహిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు ఆలయ నాలుగు మాడ వీధుల నుంచి శ్రీరామచంద్ర పుష్కరిణి వరకు తిరుచ్చి ఉత్సవం నిర్వహిస్తారు. సాయంత్రం 6.30 గంటలకు ఆస్థానం ఉంటుంది. 20వ తేదీన పునర్వసు నక్షత్రం సందర్భంగా ఉదయం 11 గంటలకు శ్రీసీతారాముల కల్యాణోత్సవం నిర్వహిస్తారు.

భక్తిశ్రద్ధలతో కేదారేశ్వరి వ్రతం



నోముల వ్రతం గురించి చెబుతున్న అర్చకుడు

తిరుపతి కల్చరల్: దీపావళి పండుగను పురస్కరించుకుని శుక్రవారం ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు తిరుపతి నగరంలోని ఆలయాల్లో కేదారి నోము వ్రత పూజలు వేడుకగా చేపట్టారు. గురువారం మధ్యాహ్నం 2.45 గంటల నుంచి శుక్రవారం సాయంత్రం 4.30 గంటల వరకు అమావాస్య గడియలు ఉన్న నేపథ్యంలో ఆలయాల్లో అర్చకులు కేదారి నోము వ్రత పూజలు నిర్వహించారు. దేవేంద్ర థియేటర్ వద్ద ఉన్న శివాలయం, మంచినీళ్లగుంట శివాలయం, అమ్మవారి ఆలయాలు, భజన మందిరాల్లో ప్రత్యేకంగా గౌరీదేవిని ప్రతిష్టించి అర్చక పండితులు వేద మంత్రోచ్ఛరణతో కేదారీ నోము వ్రత పూజలు చేపట్టారు. వివిధ ప్రాంతాల నుంచి జనం పెద్దఎత్తున తరలివచ్చి వ్రతం చేశారు.



శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో కేదారీ నోము వ్రత పూజల్లో పాల్గొన్న భక్తులు

తిరుచ్చిపై అమ్మవారు



తిరుచ్చిపై దర్శనమిస్తున్న అమ్మవారు

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారు శుక్రవారం సాయంత్రం తిరుచ్చి వాహనంపై భక్తులకు అభయమిచ్చారు. వారపు ఉత్సవాల్లో భాగంగా ఉదయం అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలను నిర్వహించారు. అభిషేకసేవ అనంతరం అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం ఆలయంలోని శ్రీకృష్ణ ముఖమండపంలో స్వామి, అమ్మవార్లకు కనుల పండువగా కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం ఆలయ సమీపంలోని అలంకార మండపంలో తిరుచ్చిపై ఆశీనులైన శ్రీవారి పట్టపురాణి, నాలుగు మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. ఈ సందర్భంగా పెద్దఎత్తున భక్తులు అమ్మవారికి ధూపదీప నైవేద్యాలను సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మండల మీట్

పాకాల: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శశిరేఖ తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆమె మాట్లాడుతూ మండలంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలు, భవిష్యత్‌లో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలపై ఎంపీపీ లోకనాథం అధ్యక్షతన సమావేశం జరుగుతుందన్నారు. మధ్యాహ్నం 2.30 గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి ప్రజా ప్రతినిధులతో పాటు మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తమ నివేదికలతో హాజరు కావాలని కోరారు.

లోఓల్టేజీ సమస్య పరిష్కరించండి

వరదయ్యపాళెం: లోవోల్టేజీ కారణంగా గ్రామంలో తరచూ విద్యుత్ సమస్యలు తలెత్తుతున్నాయని, సమస్య పరిష్కరించాలని పలుమార్లు ఆ శాఖ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని భక్తలవల్లం పంచాయతీ రాచకండ్రిగ గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం వారు తడ– వరదయ్యపాళెం రోడ్డు మార్గంలోని రాచకండ్రిగ వద్ద నిరసన వ్యక్తం చేసి, వాహన రాకపోకలను అడ్డుకున్నారు. సుమారు రెండు గంటల పాటు ఆందోళన కొనసాగడంతో రాకపోకలు స్తంభించి వాహనాలు బారులు తీరాయి. అలాగే గ్రామంలో మురుగునీటి కాలువలు, మౌలిక వసతులు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శ్రీసిటీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులతో చర్చించారు. సమస్యల గురించి సంబంధితశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

ఉపకాలువలో ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు



పిచ్చి మొక్కలతో దర్శనమిస్తున్న ఉపకాలువ

వరదయ్యపాళెం: తెలుగుగంగ ఉపకాలువలో పూడిక పేరుకుపోవడంతో నీటి ప్రవాహం సవ్యంగా జరగడం లేదు. మండలంలోని చిన్న పాండూరు మీదుగా సూళ్లూరుపేట నియోజకవర్గంలోని మాంబట్టుకు వెళ్లే తెలుగుగంగ 9బి ఉపకాలువలో పూర్తిగా పిచ్చి మొక్కలు, వ్యర్థాలతో నిండిపోయింది. దీంతో ప్రధాన కాలువ నుంచి రైతుల అవసరాల కోసం ఉపకాలువకు నీటిని విడుదల చేసిన సమయంలో నీరు సాఫీగా సాగడం లేదు. ఎక్కడికక్కడ పిచ్చి మొక్కలు, చెట్ల పొదలు అడ్డు తగులుతున్నాయి. 2004–2005లో తెలుగుగంగ ప్రాజెక్టులో భాగంగా కాలువ తవ్వారు. అయితే సంబంధిత తెలుగుగంగ అధికారులు కాలువ దుస్థితిని పట్టించుకోవడం లేదు. ఈ కాలువ పరిధిలో వరదయ్యపాళెం మండలానికి సంబంధించి దాదాపుగా 15 చెరువుల్లో సాగునీరు చేరాల్సి ఉంటుంది. తమకు ఎంతో అవసరమైన ఉపకాలువ పట్ల అధికారులు నిర్లక్ష్యం చూపడమేమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. కాలువలో పూడిక తీసి నీరు సాఫీగా జరిగేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

పింఛన్ పంపిణీకి సర్వర్ మొరాయింపు

పాకాల: సర్వర్లు సరిగా పని చేయకపోవడంతో పింఛన్ సరఫరాలో తీవ్ర అంతరాయాలు ఏర్పడ్డాయి. శుక్రవారం మండలంలోని అన్ని పంచాయతీల్లో పింఛన్ పంపిణీ ప్రారంభించగా ఒకవైపు సర్వర్లు పని చేయకపోవడం, మరోవైపు బయోమెట్రిక్ మొరాయించడంతో వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బయోమెట్రిక్‌లు రెన్యూవల్ చేయాల్సిన అవసరం ఉందని, అప్పుడే అవి సక్రమంగా వినియోగంలోకి వస్తాయని ఉద్యోగులు తెలిపారు. పింఛన్‌ను రెండు పద్ధతుల్లో పంపిణీ చేస్తారు. అందులో వేలిముద్రలు వేయడం ద్వారా, ఫేస్ యాప్ ద్వారా అందిస్తారు. అయితే సర్వర్లు, బయోమెట్రిక్‌లు మొరాయించాయి.

పండుగ నాడు పడిగాపులే..!

చంద్రగిరి: ప్రభుత్వం అందించే పింఛనుతో దీపావళి బాగా జరుపుకుందామని ఆశపడిన అవ్వతాతలకు నిరాశ ఎదురైంది. ఉదయం నుంచి పింఛను కోసం వేచి చూస్తున్న వారికి సకాలంలో పింఛన్ అందలేదు. మండలవ్యాప్తంగా శనివారం ప్రభుత్వం సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టింది. ఉదయం నుంచే అధికారులు పింఛన్ పంపిణీ చేపట్టారు. అయితే ఉదయం 9 గంటల నుంచి సర్వర్లు మొరాయించడంతో పింఛన్ల పంపిణీలో తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. చంద్రగిరి కొత్తపేటలోని జమండ్లవీధిలో ఉన్న సచివాలయం వద్ద పింఛను కోసం వృద్ధులు పడికాపులు కాశారు.





చంద్రగిరి: కొత్తపేట సచివాలయం వద్ద పింఛను కోసం పడిగాపులు కాస్తున్న వృద్ధులు, పాకాల: పింఛన్ పంపిణీకి ఇబ్బంది పడుతున్న పంచాయతీ కార్యదర్శి
పాకాల: మణిపిరెడ్డిపల్లి దళితవాడలో పింఛన్ కోసం వేచి చూస్తున్న వృద్ధులు

అట్టహాసంగా నరకాసుర వధ



తుమ్మలగుంటలో దహనం అవుతున్న నరకాసుడి ప్రతిమ

- ప్రత్యేక ఆకర్షణగా టపాసుల నరకాసురుడి ప్రతిమ దహనం
- వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

తిరుపతి రూరల్: రకరకాల టపాసుల మోతలు.. రంగు రంగుల వెలుగులతో మిరమిట్లు గొలిపేలా కాంతులు.. కళ్లెదుటే నరకాసురుడి దహనం.. ఇళ్ల ముంగిట దీపపు కాంతుల వెలుగులతో తుమ్మలగుంటలో నరక చతుర్దశి వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో 52 రకాలతో కూడిన రూ.1.72 లక్షల విలువజేసే టపాసులతో తయారు చేసిన నరకారుసురుడిని ప్రతిమ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. 15 అడుగుల ఎత్తు, 5 అడుగుల వెడల్పుతో తమిళనాడు రాష్ట్రం శివకాశి నుంచి ప్రత్యేకంగా తెప్పించిన టపాకాయలతో రూపుదిద్దుకున్న నరకాసురుడి ప్రతి మను నిపుణులు 7 రోజుల పాటు శ్రమించి తయారు చేశారు. ముందుగా పూజచేసి, నరకాసుర ప్రతిమ దహన కార్యక్రమాన్ని చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దీపం ముట్టించి ప్రారంభించారు.

చెడుపై మంచి విజయానికి ప్రతీక...

చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా దీపావళిని ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటున్నారని మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఆలయం నిర్మించిన నాటి నుంచి ఏటా ఆలయం వద్ద ఘనంగా దీపావళి పండుగ వేడుకలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. భారీ నరకాసుర ప్రతిమను ప్రత్యేకంగా తయారు చేయించినట్లు తెలిపారు.

చంద్రగిరిలో..

చంద్రగిరి: మండల వ్యాప్తంగా రెండు రోజుల పాటు దీపావళి వేడుకలు ఘనంగా జరిగాయి. టపాసులను పేల్చుతూ యువత సంబరాలు జరుపుకున్నారు. అలాగే మండలవ్యాప్తంగా ఆలయాల్లో కేదార గౌరీ వ్రత పూజలు జరిగాయి.




వాహనాలకు పూజ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా మాజీ చైర్మన్ మోహిత్ రెడ్డి

వేడుకగా దీపావళి ఆస్థానం



కోదండరామ ఆలయంలో స్వామివారికి దీపావళి ఆస్థానం నిర్వహిస్తున్న అర్చకులు

తిరుపతి కల్చరల్: తిరుపతి పట్టణంలో ఉన్న టీటీడీ పరిధిలోని శ్రీగోవిందరాజస్వామి ఆలయం, శ్రీకోదండరామస్వామి ఆలయంలో గురువారం దీపావళి సందర్భంగా శాస్త్రోక్తంగా ఆస్థానం నిర్వహించారు. ఈమేరకు శ్రీగోవిందరాజస్వామి వారి ఆలయంలోని శ్రీపుండరీకవల్లి అమ్మవారి ఆలయం నుంచి సాయంత్రం నూతన వస్త్రాలు, దీపాలు తీసుకొచ్చి బాలాలయంలోని స్వామివారికి సమర్పించారు. అనంతరం దీపావళి ఆస్థానం వేడుకగా చేపట్టారు. అలాగే శ్రీకోదండరామస్వామివారి ఆలయంలో గురువారం రాత్రి దీపావళి ఆస్థానం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓలు శాంతి, నాగరత్న, ఆలయ అర్చకులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



శ్రీపుండరీకవల్లి ఆలయం నుంచి పట్టువస్త్రాలు, దీపాలు తీసుకొస్తున్న శ్రీగోవిందరాజస్వామి ఆలయ అధికారులు, అర్చకులు

రైల్వే మజ్దూర్ యూనియన్‌లో చేరిక

రేణిగుంట: రేణిగుంట క్యారేజ్ రిపేర్ షాప్(సీఆర్ఎస్) దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్‌లో శుక్రవారం 30 మంది రైల్వే కార్మికులు చేరారు. సీఆర్ఎస్‌లోని సీఎఫ్ షాప్‌లో పనిచేస్తున్న రమీ తోమర్ తమ 30మంది అనుచరులతో కలసి యూనియన్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో చేరారు. యూనియన్ చైర్మన్ సదాశివ రెడ్డి, సెక్రటరీ బాబు మాట్లాడారు. మజ్దూర్ యూనియన్ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు నచ్చి యూనియన్‌లో కార్మికులు చేరడం ఆనందంగా ఉందన్నారు. మున్ముందు కార్మిక సంక్షేమం కోసం పలు కార్యక్రమాలను నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రెజరర్ ముని కుమార్, హెన్రీ పాల్, మునిరాధయ్య, చంద్రశేఖర్, గాండీవం దిలీప్, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు మెరుగ్గా చేపట్టండి



నగరంలో పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్, అధికారులు

తిరుపతి తుడా: నగరంలో పారిశుద్ధ్య పనులు మరింత మెరుగ్గా చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలోని సీకాం కాలేజ్ సమీపంలో, లీలామహల్ జంక్షన్‌లోని మస్టర్ గదుల వద్ద పారిశుద్ధ్య కార్మికుల హాజరు నమోదును శుక్రవారం ఉదయం ఆమె పరిశీలించారు. అనంతరం ఆమె జీవకోన, సత్యనారాయణపురం కూడలి, అమెరికన్ బార్, చేపల మార్కెట్, పండ్ల వీధి, గాంధీ రోడ్డు తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను, గార్బేజ్ వలనరబుల్ పాయింట్స్ (జీవీపీ) పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సిబ్బంది విధులకు హాజరయ్యేలా చూడాలని, అలా రాని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నగరంలోని ప్రధాన వీధుల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని సూచించారు. అలాగే గార్బేజ్ వలనరబుల్ పాయింట్ల వద్ద చెత్తను వాహనాలతో తరలించాలని సిబ్బందిని ఆదేశించారు. ఇంటింటి వద్ద చెత్త సేకరణ ఒక క్రమపద్ధతి, నిర్దిష్ట సమయంలో జరిగేలా చూడాలన్నారు. నైట్ స్వీపింగ్ రెగ్యులర్‌గా చేయాలని, నగరంలో ఎక్కడా చెత్త కనపడకుండా సిబ్బంది పనిచేయాలని సూచించారు. రోడ్లపై ఉన్న గుంతలను వెంటనే పూడ్చేలా తగు చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డీఈ మధుకుమార్, శానిటరీ సూపర్‌వైజర్లు చెంచయ్య, సుమతి ఉన్నారు.